పోలీస్ కాలనీలో బీజేపీ ప్రచారం



అమర్‌సింగ్‌కు హారతులు పడుతున్న మహిళలు

జియాగూడ: బీజేపీ వల్లే కార్వాన్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం జియాగూడలోని పోలీస్ కాలనీ, గంగానగర్, నవోదయనగర్, సబ్జిమండి, న్యూ గంగానగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటువేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. పలుచోట్ల మహిళలు మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోవర్ధన్, భిక్షపతి, శివ యాదవ్, లక్ష్మీనారాయణ, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గానికి సన్మానం



అబిడ్స్: ప్రభుత్వ డెంటల్ కాలేజ్, ఆస్పత్రి యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. నూతనంగా అధ్యక్షుడు కె.హరీష్, కార్యదర్శి శ్యామ్‌కుమార్, కోశాధికారి బాల శశికాంత్, కార్యనిర్వాహక సభ్యులు ఎంఏ ఖదీర్, జోగేంద్రరావు, వై.రోహిత్‌లను గగన్‌విహార్‌లోని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం. ముజీబ్ హుస్సేన్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, కేఆర్.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం



ఆర్ఓ విక్టర్‌కు నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్



నామినేషన్ దాఖలు చేస్తున్న మజ్లిస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ముబీన్



ఆర్వోకు నామినేషన్ అందజేస్తున్న ముజీబుల్లా షరీఫ్

అబిడ్స్: గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అబిడ్స్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఆర్.ఓ. విక్టర్‌కు ఆయన నామినేషన్ అందజేశారు. ఈ సందర్భంగా నందకిశోర్‌వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. పదేళ్లుగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతూ అందుబాటులో లేకుండా పోయారన్నారు. కేవలం ఎన్నికలప్పుడే ప్రజలముందుకు వస్తున్న రాజాసింగ్‌ను చిత్తుగా ఓడించేందుకు 30న ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. తనను గెలిపిస్తే గోషామహల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌లు మోతె శోభన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రావు, వహీద్, మమతాగుప్తా, పూజవ్యాస్ బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో 21 మంది నామినేషన్లు..

గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 21 మంది నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్, బీజేపీ అభ్యర్థి రాజాసింగ్, కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతారావు, రాష్ట్రీయ మరాఠపార్టీ అభ్యర్థిగా నందుకుమార్ తమగోలే, బీఎస్పీ అభ్యర్థిగా కరీముద్దీన్, తెలంగాణ జనసమితి అభ్యర్థిగా బత్తల రాంచందర్‌తో పాటు మొత్తం 21 మంది నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్లు ఆర్ఓ విక్టర్ తెలిపారు. నామినేషన్లు ముగింపు వరకు మొత్తం 54 మంది నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్లు వివరించారు.

నామినేషన్ దాఖలు చేసిన ముబీన్..

బహదూర్‌పురా: బహదూర్‌పురా నియోజకవర్గం మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా మహ్మద్ ముబీన్ శుక్రవారం రిటర్నింగ్ అధికారి దశరథ్ సింగ్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్ కంటే ముందు నియోజకవర్గంలోని డివిజన్ల నుంచి ర్యాలీ నిర్వహిస్తూ నామినేషన్‌ను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా మరో ఇద్దరు నామినేషన్లను దాఖలు చేశారు.

నామినేషన్ దాఖలు చేసిన చార్మినార్ కాంగ్రెస్ అభ్యర్థి..

చార్మినార్: చార్మినార్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ముజీబుల్లా షరీఫ్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తన వెంట రాగా.. మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని చార్మినార్ రిటర్నింగ్ అధికారి వెంకన్నకు తన నామినేషన్‌ను అందజేశారు.

పేద ప్రజల దీవెనలే గెలిపిస్తాయి..

పేద ప్రజల దీవెనలే తనను గెలిపిస్తాయని యాకుత్‌పురా ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లా ఖాన్ ధీమా వ్యక్తం చేశారు. చంచల్‌గూడలోని ఎంబీటీ పార్టీ కార్యాలయం నుంచి ఆయన ఓపెన్ టాప్ జీప్‌లో చంపాపేట్‌లోని ఆర్వో కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరి వెళ్లి తన నామినేషన్ దాఖలు చేశారు. ఎంబీటీ అధ్యక్షుడు ఫర్హతుల్లాఖాన్, సీనియర్ నాయకుడు శివకుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించాలి..

చాంద్రాయణగుట్ట: బీఆర్ఎస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డి శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. ఛత్రినాక నుంచి శివగంగానగర్, శివాజీనగర్, రాజన్నబావి, జంగమ్మెట్ మీదుగా ఆర్‌ఓ కార్యాలయానికి చేరుకన్నారు. జమ్మిచెట్టు రాజు, స్వరూప, ఆకుల శ్రీనివాస్, నరేష్, గండూరు రామచంద్రం, మల్లేష్ యాదవ్, క్రాంతి కుమార్, హరినాథ్ గౌడ్ పాల్గొన్నారు.

నామినేషన్‌కు ఊరేగింపుగా కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి..

జియాగూడ: కార్వాన్‌లో బీఆర్ఎస్ విజయాన్ని ఏ పార్టీ అడ్డుకోలేదని బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. శుక్రవారం నామినేషన్ దాఖలు చేయడానికి జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో పూజలు నిర్వహించగా బైకు ర్యాలీతో మిత్రకృష్ణ కలిసి వెళ్లారు. అరుణ్‌కుమార్, శేఖర్‌రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్‌గుప్తా, భిక్షపతి పాల్గొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న యాకుత్‌పురా ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లా ఖాన్



నామినేషన్‌కు ర్యాలీగా వెళ్తున్న చాంద్రాయణగుట్ట బీఆర్ఎస్ అభ్యర్థి రాంరెడ్డి



ఊరేగింపు రథంపై మిత్రకృష్ణ

'మజ్లిస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే పార్టీ'



మజ్లిస్ అభ్యర్థి కౌసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తమ పార్టీ ఉత్తుత్తి హామీలు ఇవ్వదని ఇచ్చిన హామీలను నిలబెట్టి ప్రజల ముందుకు వెళ్లే పార్టీ అని మజ్లిస్ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ, లంగర్‌హౌస్ డివిజన్లలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలుసుకొని పదేళ్లుగా తాను కార్వాన్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఆయనకు మజ్లిస్ నాయకులు సన్మానించారు. ఆయన వెంట మహ్మద్ నసీరుద్దీన్, అబీబ్‌జౌస్, హారూన్‌ఫరాన్, మహ్మద్ యూనుస్ తదితరులున్నారు.

యుగ తులసి పార్టీని గెలిపించాలి



ర్యాలీగా వెళ్తున్న యుగ తులసి పార్టీ అభ్యర్థి ఆడాల కరుణ

చాంద్రాయణగుట్ట: గో రాజ్య స్థాపన కోసం యుగ తులసి పార్టీని గెలిపించాలని ఆ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం అభ్యర్థి ఆడాల కరుణ అన్నారు. లలితాబాగ్ వినాయకానగర్‌లో బంగారు మైసమ్మ ఆలయంలో శుక్రవారం ఆమె పూజలు చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సకల దేవతా స్వరూపమైన గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలనే ఏకైక డిమాండ్‌తో ఈ ఎన్నికల్లో పార్టీ బరిలోకి దిగిందన్నారు. రోడ్డు రోలర్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఈ సందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు.

'మజ్లిస్ రౌడీయిజానికి అడ్డుకట్ట వేస్తాం'



ప్రచారంలో కార్వాన్ బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్

గోల్కొండ: 'మజ్లిస్ రౌడీయిజానికి అడ్డుకట్ట వేస్తామని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అన్ని వర్గాల ప్రజల కోసం పని చేస్తున్నదన్నారు. మజ్లిస్ మాత్రం ప్రత్యేకంగా ఐదు ఎజెండాలతో పని చేసే పార్టీ అని అన్నారు. వారి మొదటి ఎజెండా భూకబ్జాలు, రెండవది మామూళ్ల వసూళ్లు, మూడవది రౌడీయిజం, నాల్గొవది మైనార్టీ ఓట్లను చీల్చడం, ఐదవది మత్తు పదార్థాల అక్రమ రవాణా అని ఆయన ఆరోపించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సునీల్‌యాదవ్, డిజ్వర్‌సింగ్, యోగ్‌రాజ్‌సింగ్ తదితరులున్నారు.

కిషన్‌బాగ్‌లో కాంగ్రెస్ ప్రచారం



ప్రచారం చేస్తున్న రాజేష్ కుమార్

దూద్‌బౌలి: ఈ ఎన్నికల్లో తనను వేసి గెలిపిస్తే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేష్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కిషన్‌బాగ్‌లోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.

సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్ విజయం



సమావేశంలో నందకిశోర్ వ్యాస్ బిలాల్, ఆనంద్‌గౌడ్, సంతోష్‌గుప్తా తదితరులు

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధితోనే గోషామహల్‌లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. శుక్రవారం గోషామహల్ రోడ్డులోని రతన్ టవర్ వద్ద ఉన్న పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా నడుచుకుంటూ అబిడ్స్ మున్సిపల్ కార్యాలయం వరకు నామినేషన్ వేసేందుకు తరలివెళ్లారు. ముందుగా సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మీడియాతో మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో పదేళ్లుగా ఎమ్మెల్యే రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. అభివృద్ధి, ప్రగతి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే 24 గంటల పాటు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి తనను గెలిపిస్తే ప్రజా సంక్షేమానికి, ప్రజా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్, సంతోష్ గుప్తా, పరమేశ్వరీ సింగ్, ఆర్‌వీ మహేందర్‌కుమార్, జయశంకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ధంతేరస్ వేడుకలు



చార్మినార్: ధంతేరస్‌ను పురస్కరించుకొని పాతబస్తీలోని బంగారు ఆభరణాల దుకాణాల యజమానులు వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించడంతో షోరూంలన్నీ కళకళలాడాయి. దీపావళి పర్వదినానికి ముందే వచ్చే ధంతేరస్‌ను ప్రజలు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ధంతేరస్‌కు ఎంతో కొంత బంగారం ఖరీదు చేస్తే అష్టైశ్వర్యాలు కలుగుతాయని భావించే ప్రజలు అత్యధిక సంఖ్యలో బంగారం ఖరీదు చేయడానికి జువెల్లరీ షాప్‌లను సందర్శించారు. ధంతేరస్‌కు తప్పనిసరిగా బంగారాన్ని ఇంటికి తీసుకెళ్లాలనే ఆచారంతో మహిళలు కుటుంబసభ్యులతో కలిసి బంగారు ఆభరణాలు ఖరీదు చేయడానికి రావడంతో జువెల్లరీ షాప్‌లన్నీ కిటకిటలాడాయి.

కాంగ్రెస్‌తోనే గోషామహల్ అభివృద్ధి



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతారావు

అబిడ్స్: కాంగ్రెస్‌తోనే గోషామహల్ అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతారావు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆమె ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. అనంతరం మొగిలి సునీతారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. గోషామహల్ కాంగ్రెస్‌ను గెలిపిస్తే పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తానన్నారు. పదేళ్లుగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గోకరణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి దీపావళి పూజలు



పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి సాంబశివరావు కుటుంబసభ్యులు

చార్మినార్: భాగ్యలక్ష్మి ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి శుక్రవారం భక్తులు క్యూ కట్టారు. ధంతేరస్ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి సాంబశివరావు కుటుంబసభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ధంతేరస్‌ను పురస్కరించుకొని ఉదయం 4 నుంచి 5 గంటల వరకు అమ్మవారికి పంచామృతంతో అభిషేకం, ఉదయం 7 గంటలకు హారతి, సాయంత్రం 7 గంటలకు అమ్మవారి దీప్ దర్శనం తదితర కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు.

జియాగూడలో కౌసర్ పాదయాత్ర



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కౌసర్

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి గెలిపిస్తుందని ఎంఐఎం అభ్యర్థి కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం జియాగూడలోని సబ్జిమండి, క్రాంతినగర్, కార్గిల్‌నగర్, కిస్మత్ హోటల్, సాయిబాబా ఆలయం, ముస్తయిద్‌పురా, టప్పాచబుత్ర వెనుక భాగం తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం సీనియర్ నాయకులు సమద్‌వార్సి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అభినందనలు



చార్మినార్: ఛత్రినాకకు చెందిన కే.సాత్విక్ జాతీయ స్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. శంషీర్‌గంజ్‌లోని హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీలో శిక్షణ పొందిన సాత్విక్ ఆగ్రాలో జరిగిన బాక్సింగ్ చాంపియన్‌షిప్ 52 కేజీల విభాగంలో తెలంగాణ హైదరాబాద్ రీజియన్ నుంచి విజయం సాధించారు. ఫైనల్‌లో హరియాణా గురుగాం రీజియన్‌తో పోటీ పడిన సాత్విక్ విజయం సాధించి గోల్డ్ మెడల్ దక్కించుకున్నారు. శుక్రవారం ఆయన కోచ్ హబీబ్ ముస్తఫా అతడిని అభినందించారు. సాత్విక్ బార్కాస్‌లోని కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు

గోల్కొండ: సైబర్ సెక్యూరిటీ అనేది నేడు అత్యంత ప్రధానమైన అంశంగా మారిందని ప్రముఖ రిసోర్స్ పర్సన్, ఇంజినీర్ సాంబమూర్తి అన్నారు. శుక్రవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ బిల్డ్ స్మాల్ ఆఫీస్ నెట్‌వర్క్ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సాంబమూర్తి హాజరై నెట్‌వర్కింగ్ టెక్నాలజీ అండ్స్ ఆన్ ఎక్సర్‌సైజ్ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విగ్‌వెన్ జనరల్ మేనేజర్ రాజశేఖర్ కోలార్, కళాశాల చైర్మన్ రాఘవరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ శ్రీవిద్య, ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, ఐటీహెచ్ఓడీ రామచంద్రన్ పాల్గొన్నారు.



టీటీడీ అడ్వైజరి కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా మెట్టు రాఘవేంద్ర



అబిడ్స్: టీటీడీ అడ్వైజరి కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా గోషామహల్‌కు చెందిన రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మెట్టు రాఘవేంద్రను నియమించారు. టీటీడీ ఆయనను నియమిస్తూ ఆదేశాలు జారీచేసింది. మెట్టు రాఘవేంద్ర మాట్లాడుతూ.. తాను అడ్వైజరి కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనను నియమించిన ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ బోర్డుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గోషామహల్‌లో అగ్ని ప్రమాదం



అబిడ్స్: గోషామహల్‌లోని దారుసలాం గౌస్‌పురలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. శుక్రవారం రాత్రి బాలాజీ ప్లైవుడ్ గోదాంలో మంటలు చెలరేగడంతో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. బేగంబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌస్‌పురలో అగ్నిప్రమాదం సంభవించడంతో పోలీసులు నాలుగు ఫైర్ ఇంజిన్లు రప్పించి మంటలు ఆర్పించారు. లక్షల్లో ఆస్తి నష్టం జరిగింది. సకాలంలో పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకుని మంటలు ఆర్పడంతో ప్రమాదం తప్పింది.

'ఈసారి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'



చార్మినార్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తోందని.. అన్ని వర్గాల ప్రజలు తమ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించనున్నారని.. దీంతో ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఖాయమని గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు శ్యాంరావు ముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం చాంద్రాయణగుట్ట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఈ ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడుతానన్నారు. వెంకటేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దీపావళి వేడుకలు



విజయనగర్‌కాలనీలో దీపారాధన చేస్తున్న చిన్నారులు

గోల్కొండ: దీపావళి వెలుగుల పండుగని రవీంద్ర భారతీ పాఠశాలల మెహిదీపట్నం జోన్ డీన్ ప్రియ మనీష్ అన్నారు. శుక్రవారం మురాద్‌నగర్‌లోని రవీంద్ర భారతీ పాఠశాలలో జరిగిన దీపావళి వేడుకల్లో ఆమె పాల్గొని విద్యార్థులతో కలిసి ఆడిపాడి సందడి చేశారు. ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

టోలిచౌకీలో..

టోలిచౌకీ సూర్యనగర్ కాలనీలోని ఆర్‌బీఎస్‌లో శుక్రవారం విద్యార్థులు దీపావళి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ శశికళ మాట్లాడుతూ.. విద్యార్థులకు భారతీయ పండుగల విశేషాలు తెలపడానికి పండుగల సమయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

విజయనగర్‌కాలనీలో..

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం దీపావళి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ నూరీన్ ఫాతిమా పిల్లలకు దీపావళి పండుగ ప్రాధాన్యతను, బాణాసంచ కాల్చేటప్పుడు పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డీన్ ప్రియామనీష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్‌లో..

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్, ఐఎస్‌సదన్ రవీంద్ర భారతి పాఠశాలలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగు రంగుల ప్రమీదలను ఏర్పాటు చేసి వెలిగించారు. అనంతరం ఉపాధ్యాయులు దీపావళి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. డీన్ జ్యోతి, ప్రధానోపాధ్యాయులు రుబీనా, పరిమళ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌బీఎస్ మురాద్‌నగర్‌లో..



ఆర్‌బీఎస్ టోలిచౌకీలో..



సంతోష్‌నగర్ రవీంద్రభారతి పాఠశాలలో..

ఆకట్టుకున్న వైష్ణవి భరత నాట్య అరంగేట్రం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య గురువు ఎం.బద్రీనాథ్ శిష్యురాలు మెగురు వైష్ణవి భరతనాట్య అరంగేట్ర ప్రదర్శన శుక్రవారం రవీంద్ర భారతిలో కనుల పండువగా జరిగింది. నాట్యాంజలి పేరిట నిర్వహించిన ఈ ప్రదర్శనలో పుష్పాంజలి, వినాయక స్తోత్రం, త్యాగరాజ కీర్తన వంటి పలు అంశాలపై సాగిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి డైరెక్టర్ వి.ఉదయ్‌శంకర్, నాట్య గురువు కళాకృష్ణా, బాలానందం ట్రస్టు అధ్యక్షులు జేవీ కామేశ్వరీ, భరతనాట్య కళాకారిణి ఎం.సవిత తదితరులు పాల్గొన్నారు.

ఒకేరోజు రెండు కాడెర్ కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో ఒకే రోజు రెండు వేర్వేరు కాడెర్ కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తి చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో యూరాలజీ, నెఫ్రాలజీ, అనస్థీషియా విభాగాధిపతులతో కలిసి వివరాల వెల్లడించారు. మరణించిన వ్యక్తుల నుంచి జీవన్‌ధాన్ ద్వారా సేకరించి ఈనెల 2న ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న నల్గొండ జిల్లాకు చెందిన కట్టా భాగ్యమ్మ, నగరానికి చెందిన అఫ్సారూహిలకు శస్త్ర చికిత్సలు పూర్తి చేశామన్నారు. వారు పూర్తిగా కోలుకోవడంతో శుక్రవారం ఆస్పత్రి నుంచి ఇంటికి పంపించామన్నారు.

టీఎన్జీవోస్ కేంద్ర సంఘంలో ప్రాధాన్యమివ్వండి



హైదరాబాద్ జిల్లా టీఎన్జీవోస్ సమావేశం

అబిడ్స్: ఈనెల 17న టీఎన్జీఓస్ కేంద్ర సంఘానికి జరిగే పాలకవర్గంలో టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనికి తగిన ప్రాధాన్యమివ్వాలని పలువురు పేర్కొన్నారు. గగన్ విహార్‌లో జరిగిన సమావేశంలో ఎస్ఎం ముజీబ్ హుస్సేనికి ఉన్నత పదవి ఇవ్వాలని సమావేశంలో పాల్గొన్న కార్యవర్గమంతా తీర్మానించింది. ఈ అత్యవసర సమావేశంలో హైదరాబాద్ జిల్లాకు చెందిన కార్యదర్శులు, ఇతర కమిటీ సభ్యులందరూ ముజీబ్ హుస్సేన్‌కు మంచి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.